# జిన్నియా పూలు మూసిన తలుపులు

ఒరియా మూలం : హృషీకేశ్ పాండా     తెలుగు : పంకశాల అశోక్

మోహిని, వాళ్ల ఊరు ఎందుకు పోలేదు?

మెడిసిన్ పూర్తి చేసాక, ఒక ఆస్పత్రిలో సైకియాట్రిస్ట్‌గా పనిచేసింది మోహిని. ఆమె అంత అందంగా ఉండదు. నిర్మొహమాటంగా చెప్పాలంటే ఆమె ఆకర్షణీయంగా అస్సలుండదు. పైగా ముక్కుసూటిగా మాట్లాడుతుంది.

మోహిని దోస్తీ చేసేటపుడు ఆడా, మగా తేడా చూడదు. ఆమెకు చాలామంది మిత్రులున్నారు. కాని వాళ్ళలో చాలా మంది మతిమరుపు మనుషులు. మోహినిని గుర్తుంచుకోరు. ఆమె మిత్రుల్లో డాక్టర్లు, జబ్బుపడి కోలుకున్న వాళ్ళు, రోగుల్ని చూసేందుకు వచ్చేవాళ్ళు, వారి బంధువులు, ఇంకాఅలాంటి వాళ్ళే ఉంటారు.





మోహినికి చాలా మంచి మిత్రులు కొందరున్నారు. ఒక అందమైన లెక్కల ప్రొఫెసర్, లావుపాటి పశువుల డాక్టర్, ఒక బిజినెస్ మనిషి, ఊక-తవుడు-పశువుల దాణాలో హోల్‌సేల్ వ్యాపారం చేసేవారొకరు, ఒక ఎనీస్థటిస్ట్, ఒక ఆర్మీ కెప్టెన్ వగైరా. అయినప్పటికీ మెడిసిన్ పూర్తయి నాలుగేళ్ళయినా ఆమె ఎప్పుడూ, ఎవరితో ప్రేమలో పడలేదు. ఆమెతో కూడా ఎప్పుడూ, ఎవరూ ప్రేమలో పడలేదు.

ఒకానొక సెలవు రోజున మోహిని బస్సులో వాళ్ళ ఊరు వెళ్తుండగా రైల్వే క్రాసింగ్ దగ్గర గేట్ బందయి, బస్సు ఆగాల్సి వచ్చింది. ఓవర్ లోడ్ అయిన బస్సులోంచి కిటికీగుండా బయటికి చూసి, కాస్త గాలి పీల్చుకుందామె. దూరం నుంచి రైలు కూత విన్పించింది. రోడ్డు మీద అరటి గెలల మధ్య ట్రాఫిక్ పోలీసులా నిల్చుని ఉందొక చిన్నపిల్ల. అరటి గెలలు లెక్కపెట్టింది మోహిని. పన్నెండున్నాయి.

తర్వాత ఆమె వరిపొలాలకేసి చూసింది. వర్షాలు లేక వరి మొక్కలు పసుపు బారాయి. ఎండిన భూమి నెర్రెలు బారింది. అటుగా పాసింజర్ రైలు వస్తుందనుకుంది మోహిని. అట్లా అనుకోవడానికి కారణమంటూ ఏమీలేదు. ఉట్టిగానే అనుకుంది. కాని, పాసెంజర్‌కు బదులు గూడ్స్ రైలొకటి డీసెల్ ఇంజను లాగుతుండగా పాక్కుంటూ పోయింది. అయినా అందులో ఎవరో ఒకరు కన్పించక పోతారా అనుకుంది మోహిని. కాని, గార్డు తప్ప మరొక మనిషి మొహమంటూ కన్పించలేదు.

బస్ కండక్టర్ ఆశ్చర్యపోతుండగా మోహిని




ఆ తర్వాత స్టాప్‌లో దిగిపోయింది. వాళ్ళూరు వెళ్ళలేదు.

ఆమె అక్కడినుంచి, అటుగా వచ్చిన మొదటి బస్సెక్కి టౌనుకు తిరిగొచ్చింది. ఆమెకా రాత్రి నిద్రపట్టలేదు. పక్కలో అటు దొర్లి, ఇటు దొర్లి, లేచి, మళ్ళా పడుకుని, అలా రాత్రంతా గడిపి, మర్నాడే రైలెక్కి జిన్నియా పూలవనానికి పోవాలని నిర్ణయించుకుంది. అటువంటి వనం ఉందో, లేదో, ఉంటే ఎక్కడుందో ఆమెకు తెలియదు. అయితే, ఎక్కడున్నా సరే పోవాలనుకుంది. అనుకుని కొంతసేపు ఆలోచించిన తర్వాత, ప్రస్తుతం హిమాచల్ ప్రదేశ్‌లో ఉంటున్న తన కెప్టెన్ ఫ్రెండ్‌ను చూడపోవాలని నిర్ణయించుకుంది.

నోట్: మోహిని తన బాల్యమంతా చిన్నచిన్న గవర్నమెంట్ క్వార్టర్స్‌లో గడిపింది. ఏడునుండి పదేళ్ళ వయసు మధ్య ఆమె ఉన్న ఇంటి చుట్టూ జిన్నియా మొక్కలుండేవి. కొన్నాళ్ళకు వాళ్ళ నాన్నకు బదిలీ కావటంతో వాళ్ళు ఆ ఇల్లు వదలి వెళ్ళాల్సివచ్చింది. ఆ తర్వాత జిన్నియా మొక్కలున్న ఇల్లు మరేదీ దొరకలేదు జీవితంలో. తాను పెద్దయాక చాలా ఎకరాల భూమి కొని దాని నిండా జిన్నియా తోట పెంచాలని తరచు కలలు కంటుండేది మోహిని.

మోహిని రైలెక్కింది. దారిమధ్య ఒక స్టేషన్లో చాలా రద్దీ ఉంది. చాలా మంది ఎగబడి రైలెక్కారు. వారంతా హడావుడి చేస్తూ, తమ వాళ్ళు ఎక్కారా, లేదా అని పెద్దగా అరుస్తూ ఒకరినొకరు అడుగుతున్నారు. రైలు కదిలాక కూడా, అక్కడక్కడ సీట్లు ఖాళీ ఉన్నా వారెవరూ కూర్చోవటం లేదు. వారిలో మోహిని దృష్టిని ఆకర్షించాడొక వ్యక్తి. అతని మొహం పీక్కుపోయి ఉంది. అయిదారు రోజులై ఉంటుంది గడ్డం చేసుకుని. కళ్ళు మెరుస్తున్నాయి. నింపాదిగా మాట్లాడుతున్నాడు. అతను మాట్లాడినపుడల్లా తక్కిన వాళ్ళు మాటలు ఆపేసి వింటున్నారు. ఆ వ్యక్తి మధ్యమధ్య ఉద్రేకంగా "స్ట్రయిక్" అంటున్నాడు.

తర్వాత కొంతసేపు అసలెవరూ మాట్లాడలేదు. దానితో తక్కిన ప్రయాణీకులు తమలో తాము మాట్లాడుకోసాగారు. కోపంతో "స్ట్రయిక్, స్ట్రయిక్" అని అరచిన వ్యక్తి తన భుజానికి వేలాడుతున్న సంచీ లోంచి కొన్ని కాగితాలు బయటకు తీసాడు. వాటిలోంచి ఒక కాగితం గాలికి ఎగిరి, మోహిని తొడుక్కున్న ఎర్ర శాండల్స్ దగ్గర వళ్ళో పడ్డాయి. ఆమె వళ్ళోని కాగితాలను టేబిల్ మీంచి తీసుకున్నట్లుగా అందుకునేందుకు అతను చేయి చాపడంతో ఉలికిపడిన మోహిని, గబగబా అవన్నీ తీసి అతనికిచ్చింది. "పిచ్చివాడయ్యుండాలి, నా వళ్ళోకి చేయి చాపటానికి ఎంత ధైర్యం!" అనుకుందామె.

ఆ వ్యక్తి, తాము పాత పరిచయస్తులైనట్లు వచ్చి మోహిని పక్కన కూర్చున్నాడు. కాగితాలు చూస్తూ తన చిన్న డైరీలో ఏదో రాస్తున్నాడు. మోహిని అయిష్టంగానే అతని డైరీలోకి మాటిమాటికీ తొంగిచూస్తున్నది. కాని, ఏమీ చదవకుండానే మళ్ళీ అంతలోకే కిటికీలోంచి బయటకు చూస్తున్నది. అర్థనగ్నంగా ఉన్న స్త్రీలు చేపలకోసం రోడ్డు పక్క గుంటల్లోంచి నీళ్ళు తోడేస్తున్నారు. పిల్లలు బురదలో ఆడుతున్నారు. రెండో దృశ్యం: టెలిఫోన్ స్తంభాలు, వైర్లు. మూడో దృశ్యం: రైలువేపు నించుని మూత్రం పోస్తున్న మనిషి అకస్మాత్తుగా అటు తిరిగిపోయాడు. నాలుగో దృశ్యం: ఒక ఆవో, ఎద్దో రైలును పట్టించుకోకుండా శ్రద్ధగా గడ్డి మేస్తున్నది. మోహిని మళ్ళీ ఆ వ్యక్తిని చూసింది. అతను పెన్ను చివరను వేలితో రాస్తూ ఆలోచనల్లో మునిగిపోయి ఉన్నాడు.

"నేను మెచ్చుకోవాలని చూస్తున్నట్లున్నాడు", అనుకుంది మోహిని.

తర్వాత స్టేషన్‌లో ఆ వింతమనిషి సహచరులంతా దిగిపోయారు. అతను తలుపుదాకా వెళ్ళి ఒకరి చెవిలో ఏదో చెప్పాడు. రైలు కదలగానే, "నేను తిరిగి రాగానే కలుస్తా మిమ్మల్ని", అని కేక వేసాడు. అప్పుడు తిరిగి వచ్చి మోహిని ప్రక్కన కూర్చుని చిరునవ్వు నవ్వాడు. (నవ్వాడా, లేక అతని నోటి చివర్లను ఎవరైనా గేలాలతో పట్టి లాగారా?)

"నా పేరు ఇంద్రద్యుమ్న. ఒక సిమెంటు ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాను. కార్మిక సంఘం అధ్యక్షుణ్ణి. మేనేజ్‌మెంట్‌తో చర్చలకోసం ఢిల్లీ పోతున్నాను. వాళ్ళు మా డిమాండ్లకు ఒప్పుకోకపోతే నిరవధిక సమ్మె చేస్తాం. ధరల విధానం మారడంతో కంపెనీకి ఈసారి బాగా లాభాలొచ్చాయి. పాత స్టాక్‌లు కొత్త ధరల కమ్మారు. మీరు స్త్రీలు, చదువుకున్నవారు, బహుశా ఎక్కడో ఉద్యోగం చేస్తుండి ఉంటారు. ఓ, మీరు డాక్టరా! మా సమ్మె ఆలోచనలు విని మీకు కోపం వచ్చి ఉండాలి. ఇవన్నీ మీరు పెట్టుబడిదార్ల పత్రికల్లో, వాళ్ళ పుస్తకాల్లో చదువుతుంటారు గనుక మీకు చాలా విషయాలు తెలియవు. అరె, మీరవి కూడా చదవరా? మెడికల్ పుస్తకాలొక్కటే చదువుతారా? సరే, మంచిదే. ఉద్యోగం బయట ఏం జరుగుతున్నదో తెలుసుకోనక్కర్లేదా? అచ్చా, కామిక్స్ కూడా చదువుతారా. అలాగయితే నేను మీకో మంచి పుస్తకం ఇస్తాను." అన్నాడతను.


ఆమాటని, తన సంచీలోంచి మూడు, నాలుగు సన్నటి పుస్తకాలు తీసి మోహినికి ఇచ్చాడు ఇంద్రద్యుమ్న. అవి అందమైన కాగితం పైన అందంగా అచ్చువేసి ఉన్నాయి. ఈ సారి అకస్మాత్తుగా పెద్దగా నవ్వుతూ ఇంద్రద్యుమ్నను షాక్ చేయటం మోహిని వంతయింది. ఆమె అప్పుడప్పుడు ఇలాంటిదేదో చేసి తన మిత్రులను ఆశ్చర్యపరచటం, భయపెట్టడం మామూలే.

మోహిని నవ్వడం ఆపి, "నేను సెలవుమీద హిమాచల్ వెళుతున్నాను. ఇంక

ఆ ఉద్దేశం లేదు. నన్ను ఢిల్లీ తీసుకుపోయి ఫిలాసఫీ పాఠాలు చెప్పండి" అంది.

నోట్: "జీవితం అంటే ఏమిటి?" అన్న ప్రశ్నకు సమాధానం కనుగొనేందుకు ఇంద్రద్యుమ్న తనను తాను ఇంటరాగేట్ చేసుకుంటుంటాడు. కాని సమాధానం దొరకదు. చివరకు జీవితంలో ఘనమైనది ఏదో సాధించాలనుకుని తిరుగుబాటుదారు అయాడు.

మోహిని కలకత్తాలో రైలు మారింది, ఇంద్రద్యుమ్నతో కలిసి వెళ్ళాలని. కాని బెర్త్ దొరకక ఇంద్రద్యుమ్న బెర్త్‌ను ఆక్రమించుకుంది. ఇంద్రద్యుమ్న రాత్రంతా ఏదో చదువుకుంటూ, రాసుకుంటూ తెల్లవారుతుండగా నిద్రపోయాడు.




తర్వాత కాసేపటికే కంపార్ట్‌మెంట్‌లో ప్రయాణీకుల సందడి మొదలైంది. ఢిల్లీ దగ్గరవుతున్నది. ఆ సందడికి మోహిని, ఇంద్రద్యుమ్న నిద్రలేచారు. వారి మధ్య సమ్మె ప్రస్తావన వచ్చింది. దానితో అతనిలో ఉత్తేజం వంటిది కలిగింది. అయితే, వ్యవహారం తమకు అనుకూలంగా జరుగుతుందన్న ఆశాభావం కూడా కన్పించింది. మోహిని ఏమీ అర్థంకానట్లు మొహం పెట్టినా అతను పట్టించుకోకుండా, "మాకు నాలుగు స్ట్రాంగ్ పాయింట్లున్నాయి. ఒకటి--వాళ్ళు నిరుడు వచ్చిన లాభాలను ఏడేళ్ళ క్రితం వచ్చిన నష్టాలకు చెల్లుబాటు చేయాలని చూస్తున్నారు. రికార్డుల ప్రకారం ఆ ఏడు కంపెనీలలో ఉత్పత్తి మొదలవలేదు. రెండు - నిజానికి ఉత్పత్తి మొదలైంది గాని, ఆదాయం పన్ను ఎగవేసేందుకని ఆమాట రికార్డు చేయలేదు. ఇదంతా టాక్స్ వాళ్ళకు, పత్రికలకు చెప్తానని నేను మేనేజ్‌మెంట్‌ను బెదిరించాల్సి ఉంటుంది. మూడు - నిరుటి ఉత్పత్తులు ఈ సంవత్సరం అమ్ముతూ అధిక లాభాలు గడిస్తున్నారు. నాలుగు -- ఇదంతా రుజువు చేసేందుకు నాదగ్గర డాక్యుమెంట్లున్నాయి"

రాత్రి మోహినికి జిన్నియా మొక్కలు సందులేకుండా పెరిగిపూసిన ఇల్లొకటి కలలో కన్పించింది. కిటికిలోంచి బయటకు చూసే సాకుతో ఆమె ఇంద్రద్యుమ్నకు దగ్గరగా జరిగి కూర్చుంది. వాళ్ళిద్దరూ కలిసే టీ తాగారు. స్టేషన్ వస్తుండటంతో సామాన్లు సర్ది, ఒకరి అడ్రసు ఒకరు తీసుకున్నారు. స్టేషన్ రాగానే ఎవరి సామాను వారు తీసుకున్నారు. ఇంద్రద్యుమ్న ముందు దిగాడు. మోహిని నిశ్చలంగా నిలుచుంది. జ్ఞాపకాలన్నీ చెదిరిపోగా ఇంద్రద్యుమ్న ముఖాన్ని గుర్తు తెచ్చుకునేందుకు శాయశక్తులా ప్రయత్నించింది. (మరెప్పుడో, మరెవరో అమ్మాయి, మరేదో రైలు నుంచి మరేదో ప్లాట్ ఫాం పై దిగి, బొమ్మలవాడి దగ్గర విమానం బొమ్మ ఒకటి కొన్నట్లు భాసించింది.) మోహినికి పొత్తి కడుపులో దేవినట్లయింది.

ఢిల్లీలో ఒంటరిగా రెండు రోజుల పాటు గమ్యం లేకుండా తిరిగి, తాను పని చేసే ఆస్పత్రికి తిరిగి వచ్చింది మోహిని. వచ్చిన తర్వాత, వింతైన అశాంతి ఏదో ఆవరించిందామెను. చాలా రోజుల తర్వాత ఇంద్రద్యుమ్న రెండున్నర పేజీల సుదీర్ఘమైన ఉత్తరం ఒకటి రాసాడు. ఏముంది అందులో? మేనేజ్‌మెంట్‌తో చర్చలు ఎలా విఫలమయ్యాయో, సమ్మె ఎలా సాగిందో, చివరికి వారి ఏడు కోరికలలో మూడింటిని మేనేజ్‌మెంట్ ఎలా ఆమోదించిందో ఆ వివరాలన్ని ఉన్నాయి. అందుకు సమాధానంగా మోహిని తమ ఆస్పత్రిలో ఒకరికి ఎలా చికిత్స చేసారో చాలా చాలా చెప్పి, చివరలో తన ఒంటరితనం గురించి కాస్త రాసింది. అట్లా చెరి మూడేసి ఉత్తరాలు రాసుకున్న తర్వాత మోహిని, ఇంద్రద్యుమ్న పెళ్ళి చేసుకున్నారు. అట్లా జరగటంలో ఆశ్చర్యమేముంది?

పెళ్ళి తర్వాత మోహిని మొదటిసారిగా తన భర్త ఊరు వెళ్ళినప్పుడు ఇలా జరిగింది. వెళ్ళటానికి ఏడు రోజుల ముందు ఆమె తను వచ్చేరైలు, కోచ్, టైము మొదలైన వివరాలన్నీ భర్తకు రాసింది. తర్వాత టెలిగ్రాం ఇచ్చింది. కాని రైలు చేరేసరికి ఇంద్రద్యుమ్న అక్కడ లేదు. నిజం చెప్పాలంటే అసలు గడ్డం మనిషెవరూ మొత్తం స్టేషన్లోనే కన్పించలేదు. దానితో ఒంటరిగా బయలుదేరిన మోహిని, ఇంద్రద్యుమ్న అడ్రసేమిటో, రిక్షావాలా ఒకరికి చాలా కష్టపడి చెప్పగలిగింది.

ఆమె అక్కడికి చేరేసరికి గేటు తీసి ఉంది. ఇల్లు తాళం వేసి ఉంది. చాలా పెద్ద తాళం. వికారంగా ఉన్న ఎద్దొకటి కాంపౌండ్‌లో ముడుచుకుని పడుకుంది. రిక్షామనిషి సూట్‌కేసును వరాండాలో పడేసి, రెట్టింపు ఛార్జీ వసూలు చేసుకుని పోయాడు. మోహిని మౌనంగా సూట్‌కేస్ పైన కూర్చుంది. ఎద్దు భయానికి వరాండా దిగి రాలేదు. తెరిచున్న ఒక కిటికీ లోంచి ఇంటి లోపలకు చూడగా ఆరేసిన లుంగీ, డ్రాయర్ కన్పించాయి. లుంగీకి నాలుగయిదు చిల్లులున్నాయి. సిగరెట్ వల్ల అయినట్లున్నాయి. తర్వాత దూరంగా ఉన్న బోడికొండలను, పొరుగు వాళ్ళ పెరటిని, శూన్యాకాశాన్ని అదే వరసలో చూసింది మోహిని.

ఆమెకు మొదట చాలా కోపం వచ్చింది. తర్వాత, భర్త ఆరోగ్యం బాగాలేదేమోనన్న సందేహం కలిగింది. చివరకు దాదాపు ఏడ్పు పర్యంతమయింది.

కొంత సేపటికి ఇరుగమ్మ బయటకు వచ్చి మోహినిని చూసి ఆశ్చర్యపోయింది. మోహిని ఎవరై ఉంటుందో ఆమె ఇంచుమించు పోల్చుకుంది. కాని నవ్వాలో, లేదో వెంటనే తేల్చుకోలేక పోయింది. చివరకు ఎండకు గొడుగు విప్పుకున్నట్లు మొహమంతా నవ్వు చేసుకుంటూ, "నువ్వు......?" ఆవిడవే కదా అన్నట్లు మొహం పెట్టి అర్థోక్తిలో ఆగింది.

ఆ మనిషిని చూసి నవ్వాలో, లేదో మోహినికి తెలవలేదు. అయినా నవ్వింది.

ఆమెను ఇరుగమ్మ తమ ఇంట్లోకి రమ్మని ఆహ్వానించింది. మోహిని వెళ్ళి వాళ్ళ పిల్లలకు, పనిమనిషికి, వారి క్షుద్ర జబ్బులకు, లేని జబ్బులకు అన్నిటికీ పరీక్షలు చేసి, మందులు రాసింది. ఆ వెనుక మర్యాద కోసం వాళ్ళతో ఎంతసేపు సాగదీసి మాట్లాడుతూ కూర్చున్నా ఇంద్రద్యుమ్న జాడ కన్పించలేదు. దానితో వాళ్ళ డ్రాయింగ్‌రూంలో మోహినికి పడక సిద్ధం చేసారు. ఆమె నిద్ర పోయేందుకు ప్రయత్నించింది. ఇంద్రద్యుమ్న అర్థరాత్రి దాటినాక రెండు గంటల ప్రాంతంలో ఇల్లు చేరాడు. అతని దగ్గర తాళం చెవులు పోవడంతో తాళం పగలగొట్టారు. "ఎలాగూ తాళం పగలగొట్టాల్సి వచ్చింది గనుక ఆ పనేదో నువ్వే చేస్తే సరిపోయేది", అంటూ జోక్ చేసాడు ఇంద్రద్యుమ్న. మోహినికి నవ్వు రాలేదు.

ఆ రాత్రి ఇంద్రద్యుమ్న ఎందుకో ఆందోళనగా, చికాకుగా ఉన్నాడు. మోహిని రాకలోని ప్రత్యేక సందర్భాన్ని మరచిపోయాడు. అతను యూనియన్ వ్యవహారాలకు సంబంధించి కొన్ని నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. యూనియన్ సభ్యుల్లో కొందరు, పోలీసులతో లడాయీకి సిద్ధం కావాలంటారు. సమ్మె చేస్తున్నపుడు ఒకోమారు అనుకోకుండా పోలీసులతో తగాదా వస్తుంది. అటువంటపుడు కార్మికులు ఏం చేయాలన్న దానిపై మార్క్స్, ఏంగెల్స్ ఏమన్నారో ఆ సభ్యులు ఏకరువు పెట్టారు. కాని ఇంద్రద్యుమ్నకు ఘర్షణలు ఇష్టం లేదు. అది తన యూనియన్ పని కాదంటాడు. తను స్టేషన్‌కు రాకపోవటానికి కారణంగా ఇదంతా మోహినికి వివరించాలనుకున్నాడు అతను. స్టేషన్‌కు రాకపోవడం గురించి ఆమె అడుగుతుందని, అప్పుడు అంతా చెప్పి యూనియన్ విషయంలో తన అభిప్రాయానికి ఆమె మద్దతు సంపాదించాలని అనుకున్నాడు. కాని, ఆమె మొహం మూసుకుపోయిన తలుపుల్లా ఉంది. ఒక్క మాట కూడా మాట్లాడలేదామె. ఆ మురికి మంచంమీద, మొహం గోడవేపు తిప్పి, చలనం లేకుండా పడుకుంది. ఇంద్రద్యుమ్న స్టవ్ వెలిగించి, కాఫీ చేసి, ఒక్కడే తాగాడు. మోహిని అప్పటికింకా నిద్రపోలేదు. లైటు ఆర్పేయమంది.

మరునాడు.

సిమెంట్ టౌన్‌షిప్‌కు కాస్త దగ్గర్లోనే ఉన్న ఒక సరస్సుకు పిక్నిక్ వెళ్ళాలనుకున్నారు భార్యాభర్తలు. సరస్సు పక్కనే ఫారెస్ట్ డిపార్టుమెంటు వాళ్ళది అందమైన పార్క్ ఒకటుంది. తక్కువ రేట్లకే చిన్నచిన్న బోట్లు అద్దె కిస్తారక్కడ. బ్రేక్ ఫాస్ట్‌కాగానే బ్రెడ్, బటర్, జాం, అరటి పళ్ళు, ఉడకబెట్టిన గుడ్లు తీసుకుని ఇద్దరూ బస్టాండ్ చేరుకున్నారు. దారిలో రెండు బీరు సీసాలు కూడా కొన్నారు. అంతలో, యూనియన్ ఆఫీసు తాళాలు తన దగ్గరున్న విషయం ఇంద్రద్యుమ్నకు హఠాత్తుగా గుర్తుకు వచ్చింది. బస్సు రావటానికి ఎలాగూ ఇంకా అరగంట టైముంది గనుక, పావుగంటలో తాళాలు ఇచ్చేసి వస్తాననుకున్నాడు ఇంద్రద్యుమ్న.

అనుకుని, "ఇప్పుడే ఒక్క నిముషంలో వచ్చేస్తా"నని మోహినితో అంటూ రిక్షా ఎక్కాడు. ఆమె లంచ్ ప్యాకెట్లు పట్టుకుని రోటరీ క్లబ్ వారి బస్ షెల్టర్‌లో కూర్చుంది.


మొదటి బస్సు ఎనిమిదీ ముప్పావుకి రాగానే మోహిని అందులో ఎక్కి, రెండు టిక్కెట్లు కొని, ముందు వరుసల్లో, కిటికీ సీట్లు ఆక్రమించి కూర్చుంది. ఆమె ఊహలు సరస్సులో బోట్లపైన విహరించసాగాయి. సరస్సుని ఆనుకుని ఉన్న పార్క్, ఊహాగానపు జిన్నియా తోట మనస్సులో మెదిలాయి. గడిచిన రాత్రిని పీడకలగా మరచిపోయి, పల్లీలు అమ్మే కుర్రవాడ్ని నవ్వుతూ చూసింది. ఆ పిల్లవాడు మోహినికి ఒక పొట్లాం అందిస్తూ, "చారాణా" అన్నాడు. కొనాలని లేకపోయినా ఒకటి కొందామె. కాని, ఆ పిల్లవాడ్నిచూసి మళ్ళీ నవ్వింది. రోడ్డుమీద పోతున్న కుంటికుక్కను చూసి నవ్వింది.

సరిగా తొమ్మిదికి డ్రయివర్ హారన్ మోగించి బస్సు స్టార్ట్ చేయబోయాడు. ఇంద్రద్యుమ్న ఇంకా రాలేదు. మోహిని కోరటంతో బస్సును మరో అయిదు నిముషాలు ఆపారు. ఆ తర్వాత ఆమె తీవ్రమైన అవమానంతో బస్సు దిగింది. చుట్టూ ఉన్న ప్రతీ చరాచరం, తనను భర్త వదిలేసాడన్నట్లుగా చూసి నవ్వుతున్నట్లు తోచిందామెకు. గుల్‌మెహర్ చెట్టును చూడగా అది "ఎహెహె!" అని నవ్వింది. తలవంచుకోగా తన చీర అంచులోని పిట్టబొమ్మ కూడా "ఎహెహె!" అని నవ్వింది.

బస్టాండ్‌లో అవీ, ఇవీ అమ్ముకునే వెధవలు తనను చూసి తచ్చాడుతూ అదో రకంగా చూసారు. ఒకడు మరీ దగ్గరగా వచ్చి "బ్రెడ్, బ్రెడ్" అంటూ గట్టిగా అరిచాడు. మోహినికి తిక్క రేగి "గెటౌట్!" అని అరిచింది. రిక్షావాడొకడు దగ్గరగా వెళ్తూ, రెచ్చగొట్టేట్లుగా బెల్లు కొట్టాడు. జీన్స్, రంగుల షర్టు వేసుకున్న పోకిరీ వాడొకడు ఆమె ఎదుటనే కూర్చుని సిగరెట్‌పై సిగరెట్ తాగసాగాడు. వాడట్లా అరగంటపాటు చూసి "ఎక్కడికెళ్తున్నావ్?" అని అడిగాడు. జవాబేమీ రాకపోవటంతో చేసేది లేక వెళ్ళిపోయాడు.

బస్సుల కోసం వస్తూ, వాటికోసం ఎదురు చూస్తూ, అవి రాగానే ఎక్కిపోతూన్న ప్రయాణీకులను గమనిస్తూ కూర్చుంది మోహిని. ఒంటిగంట అవుతుండగా ఆమెకు ఆకలనిపించింది. జాం రాసుకుని రెండు బ్రెడ్ ముక్కలు తినటంతో అది శాంతించింది. అప్పుడు దప్పికైంది. ఇంటికి వెళ్ళిపోయి రెండు బీర్లూ తాగి ఏడవాలనిపించింది ఆమెకు. అయితే, తాళం చేతులు తన దగ్గర లేవన్న విషయం గుర్తొచ్చింది. పత్రికలేవో కొని బొమ్మలు చూసింది కాసేపు.

సాయంత్రం ఏడవుతుండగా వచ్చాడు ఇంద్రద్యుమ్న. రిక్షా పిలవమంది మోహిని.



ఇద్దరూ రిక్షాలో ఎక్కి ఇల్లు చేరారు. లంచ్ చేసావా అని మధ్యలో ఒకసారి అడిగాడు ఇంద్రద్యుమ్న. "నీకోసం ఎదురు చూడాల్సిందా?" అని అడిగింది మోహిని.

మోహిని బాత్‌రూంలో చాలా సేపు ఏడ్చి, అపుడు స్నానం చేసింది. ఆమె జిన్నియా పూలమాట మరచిపోయింది. స్నానం తర్వాత ఆరు బయట ఒక్కతే పేము కుర్చీలో కూర్చుని బీరు సీసా తెరిచింది. సీసా సగం ఖాళీ అయేసరికే ఆమెకు మత్తుగా అన్పించి, మళ్ళీ అదే మురికి మంచం మీద గోడవేపు తిరిగి పడుకుంది.

ఇంద్రద్యుమ్న రోజంతా ఏం చేసాడు?

తను రాత్రి యూనియన్ ఆఫీసు వదలిన రెండు గంటల తర్వాత, కొలిమి దగ్గర నైట్ షిఫ్ట్‌లో పనిచేస్తున్న ఎలెక్ట్రీషియన్ ఒకరు ఊపిరాడక చనిపోయాడు. దానితో తను తాళాలు ఇచ్చేందుకు ఆఫీసుకు వెళ్ళేసరికి అక్కడ పదిహేను మంది కార్మికులు గుమికూడారు. వాళ్ళు విషయమంతా ఇంద్రద్యుమ్నకు చెప్పారు. అది విన్న ఆయన ముందుగా ఎలెక్ట్రీషియన్ ఇంటికి వెళ్ళి అతని భార్యను, విధవ తల్లిని, పెళ్ళికాని చెల్లిని రకరకాలుగా ఓదార్చాడు. సహచరుని తరఫున వెయ్యి రూపాయలు ఇస్తామన్నాడు. చనిపోయినతను యూనియన్‌కు సభ్యత్వం ఫీజు సరిగా కట్టేవాడు కాదు గనుక అట్లా డబ్బు ఇవ్వొచ్చునా అని తర్జన భర్జనలు కూడా జరిగాయి. అతనికి పరిహారం గురించి జనరల్ మేనేజర్‌తో సాయంత్రం దాకా చర్చలు సాగాయి.

ఇంద్రద్యుమ్నకు రోజు మొత్తం మీద మోహిని ఒక్కమారే గుర్తుకు వచ్చింది. అది కూడా ఎలెక్ట్రీషియన్ భార్యను చూసినపుడు. ఎలెక్ట్రీషియన్ భార్య ఏడవలేదు. ఆమె మొహంలోని విచిత్రమైన భావాలు గమనించిన ఇంద్రద్యుమ్నకు మోహిని మొహం గుర్తుకు వచ్చింది. చనిపోయినతను బాగా తాగి భార్యను కొడుతుండేవాడు.

జనరల్ మేనేజర్‌తో చర్చలు ముగిసినాక ఇంటికి వెళదామని సైకిల్ కోసం చూసాడు ఇంద్రద్యుమ్న. జేబులో సైకిల్ తాళం కన్పించలేదు. అప్పుడు గుర్తుకొచ్చింది ఇవాళ తాను రిక్షాలో వచ్చినట్లు. ఆ తర్వాత క్రమంగా తక్కిన విషయాలు గుర్తుకొచ్చాయి. మోహినిని కలవగానే జరిగిందంతా వివరించి, తాను సాధించింది చెప్పి, ఆమె మెప్పు పొందాలని కలగన్నాడు. కాని ఆమె మొహాన్ని చూడగానే మూసిన తలుపులు కళ్ళముందు మెదిలాయి. దానితో మౌనంగా ఉండిపోయాడు. కనీసం "సారీ" అన్నమాట కూడా నోటినుంచి రాలేదు.

ఇది జరిగిన అయిదేళ్ళకు మోహిని తిరిగి ప్రేమలో పడింది.

మోహిని తల్లి అయింది. ఇంద్రద్యుమ్నకు మోహిని అనే మనిషి ఒకరు ఉన్నట్లు కూడా స్పృహ లేదు. ఆమె కంటికి కనిపించనట్లు, ఆమె ఒక పారదర్శక వస్తువైనట్లు చూస్తుంటాడతను. కూతురు మాత్రం గుర్తుకొస్తుంది అప్పుడప్పుడు.

కాలం గడుస్తున్నది. ఇంద్రద్యుమ్న ఎవరితోనో ప్రేమలో పడినట్లు ఒకసారి అనుమానం కలిగింది మోహినికి. కాని ఆమె అసూయ పడలేదు. పైగా, సమాజానికి అంకితమైన వాడినన్న అతని అహంకారపు నీతి సూత్రపు నీటి బుడగ ఎట్టకేలకు పగిలింది కదా అని సంతోషించింది కూడా. అలాగే, ఆ హృదయం లేని మనిషికి కాస్త మానవ లక్షణాలు అబ్బుతాయని ఆనందించింది.

మోహిని ట్రాన్స్‌ఫర్ కోసం ప్రయత్నించి చివరకు సంపాదించింది. ఒక దశలో మనసు క్రుంగిపోయినట్లనిపించి మళ్ళీ దూరానికెక్కడికో ట్రాన్స్‌ఫర్ చేయించుకుంది. ఆమె తరచు మౌనంగా, విచారంగా ఉండేది. ఒకోసారి ఆత్మహత్య చేసుకోవాలనుకునేది. ఆ రోజుల్లోనే, భూమినుండి పదిలక్షల ఆరువందల ముప్పయ్యారు వేల కిలోమీటర్ల దూరానగల హేలీ తోకచుక్క, రెండు వందల ఇరవై మూడు వేల కిలోమీటర్ల దగ్గర్లోకి రానున్నట్లు విందామె. దానితో, తాను బతికి ఉండాలని, అంత బుద్ధిగా భూమివైపు తిరిగి వస్తున్న ఆ తోకచుక్కను చూడాలని, నిర్ణయించుకుందామె. అదే రోజున ఆమె తనకన్నా మూడేళ్ళు చిన్నవాడు, ఇంకా పెళ్ళికాని వాడూ అయిన మరొక డాక్టర్‌తో ప్రేమలో పడింది. వారు చివరివరకు ఒకరినొకరు "మేడం" అని, "డాక్టర్" అని పిలుచుకునేవారు. పరస్పర ప్రేమను వారు మాటలలో ఎప్పుడూ వ్యక్తీకరించలేదు. అయితేనేమి, ప్రగాఢంగా ప్రేమించుకున్నారు.

ఇంద్రద్యుమ్న జీవితంలో ఒక సాయంత్రం: యూనియన్ రాజకీయాల్లో తన ఓటమిని అంగీకరిస్తూ, యూనియన్‌నుంచీ రాజీనామా చేసాడు ఇంద్రద్యుమ్న. అది ఏడాది క్రిందటిమాట. అయినప్పటికీ ఆయన సలహాకోసం నలుగురూ వస్తుండేవారు. ముఖ్యమైన చర్చలకు ఆయనను పిలుస్తుండేవారు. తను సాయంకాలాలు ఎక్కువగా ఇంట్లోనే గడిపేవాడు. మోహినికి నెలకొక మారు ఉత్తరం రాసేవాడు. సిగరెట్టు తగ్గించాడుగాని తాగుడు అలవాటైంది. వాళ్ళ కూతురు పల్లెటూళ్లో అమ్మమ్మ, తాతయ్యల ప్రేమానురాగాల పందిట్లో పెరుగుతున్నది.

ఒకరోజు సాయంకాలం ఇంద్రద్యుమ్న కంపెనీ బస్ దిగి ఇంటివేపు నడుస్తున్నాడు. ఇంటి పొరుగున మునుపు ఉండేవాళ్ళు ఖాళీచేసి కొత్త వాళ్ళొచ్చారు. ఆ ఇంటాయన ప్రద్యుమ్నకు అంతంత మాత్రమే తెలుసు. ఇంటికి వెళ్తున్న ప్రద్యుమ్నను పొరుగు వాళ్ళ వరండాలోంచి వాళ్ళ మెల్ల కన్ను పెద్దమ్మాయి మరీ మరీ చూసింది. అతను ఇంట్లోకి వెళుతూ, ఇంటికి కాపలాగా ఒక కుక్కను పెంచితే బాగుండుననుకున్నాడు. చాలా కాలంగా మోహిని విషయాలేమీ తెలియవు. పోయిన ఉత్తరంలో ఆమె తమ కూతురు మహా పెంకిది అయిందని, చెడ్డ మాటలు నేర్చుకుంటున్నదని రాసింది.

మూసిన తలుపుల దృశ్యం పదేపదే కళ్లముందుకు వచ్చి ఇంద్రద్యుమ్నను వేటాడసాగింది. ఎటూ పాలుపోక రికార్డ్ ప్లేయర్ ఆన్ చేసాడు ఇంద్రద్యుమ్న. కాని సంగీతం వినాలనిపించలేదు. డిస్కో వేసాడు. ఆ పాటలు అర్ధమవలేదు. తాగి, ఒంటరిగా డాన్స్ చేసాడు. తాను చాలా కాలం క్రితం ఒక పెళ్ళి పార్టీలో డాన్స్ చేయటం గుర్తొచ్చింది. ఇప్పుడు తనే పెళ్ళి కొడుకయి, ఊరేగింపులో మరెవరూ లేకపోవటంతో, తన పల్లకీ ముందు తనే ఒంటరిగా డాన్స్ చేస్తున్నట్లు ఊహించుకున్నాడు. అంతలోనే పెళ్ళికూతురు ఇంటికి దారి మరచిపోయినట్లు తోచి పెద్దగా ఏడవసాగాడు. నిద్రలో పీడకల వచ్చి భయపడి, పక్కదుప్పటితో ఉరివేసుకోబోయిన వాడిలా ఏడవసాగాడు.

తర్వాత కొంత సేపటికి, తాను వందనను పెళ్ళిచేసుకోనున్నట్లు జ్ఞాపకం వచ్చింది. అయితే, అసలు వందన అనే మనిషి లేదని అంతలోనే అర్థమయింది. కాలేజీలో వందన అనే సుందరి తన ఊహలలోని వ్యక్తి. ఇతరులతో గొప్పలు చెప్పుకునేందుకు సృష్టించాడామెను. కాని, అసలు తానే సుదూరాన్నుండి గాలిలో తేలి వినిపిస్తున్న ఒక ఒంటరి గీతాన్నని అతనికి క్రమంగా బోధపడింది.